# అలక

పి.శైలజ

"అలిగిన వేళనె చూడాలి... గోకుల కృష్ణుని అందాలు..." "అలుక మానవే చిలుకల కొలికి రో..."

ఆ కవిత్వంలో ఎన్ని సొగసులు ! పారిజాతాపహరణం ఘట్టంలో సత్యభామ కోప గృహ ప్రవేశం. శ్రీకృష్ణుడు ఆమెగారిని ప్రసన్నురాలిని చేసుకోవడానికి పడిన పాట్లు మధుర కావ్యంగా నిలిచిపోయింది. కోపం, అలక స్త్రీకి పెట్టని ఆభరణం. ఆ అలకను పోగొట్టి ఆ కోపాన్ని తాపాన్ని లాలించి, చల్లార్చి, స్త్రీని వశపరచుకోవడం పురుమనిలోని విశిష్ట లక్షణం. భార్య అలిగిందో, లేదో తెలుసుకోలేని పురుషపుంగవులు?

నిద్రపోతున్న భర్త వైపు చూసింది పావని. ఈ లోకంతో తన కేం సంబంధం లేనట్లు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు శేఖర్.

చిన్నగా నిట్టూర్చింది పావని. ఉదయం జరిగిన పోట్లాట అతనికి గుర్తు లేనట్లుంది. తను అలిగినా అతనికి చీమ కుట్టినట్లయినా లేదు. అతను తనతో పోట్లాడినందుకు తను బాధపడదు. కానీ మగువ మనసు తెలుసుకుని రంజింపచెయ్యలేని భర్తను ఏమనాలి?

ఆడవాళ్ళు ఎంత అల్పసంతోషులో- భర్త 'అందంగా ఉన్నావు' అని పొడిగితే చాలు తబ్బిబ్బవుతారు. అలిగినా, కోపగించినా కాస్త బ్రతిమాలితే చాలు కరిగిపోతారు. కానీ ఈ శేఖర్‌గారు ఏ కోవకూ చెందని మనిషి. ఏ చీర కట్టుకున్నా అందంగా ఉన్నావని పొగడరు, అలిగినా బాధపడినా 'ఎందుకలా ఉన్నావ'ని కూడా అడగరు. కోపం, బాధ అన్నీ తనే అనుభవించాలి. ఎంత ఆడదైనా తనూ మనిషే కదా ! నిద్ర రాని ఒంటరి రాత్రిలో తన మనసు తెలుసుకుని 'ఎందుకు ఇంకా నిద్రపోలేదు' అని మృదువుగా అడిగే తోడు ఉంటే? అలాంటి భర్తలు ఉన్నారా?

చలం 'మైదానం' గుర్తుకు వచ్చింది. తన పిచ్చిగానీ ఆడవాళ్ళ మనసు గూర్చి లోతుగా ఆలోచించే తీరిక ఈ దేశంలో ఎంతమంది మగవాళ్ళకు ఉంటుంది? అసహనంగా పక్కమీద కదిలింది పావని.

పావని చిన్నప్పటి నుంచి భావుకురాలు. ప్రతి చిన్న సంఘటనకూ తీవ్రంగా చలించిపోతూ బోలెడన్ని ఊహలు అల్లుకుంటుంది. పుత్తడిబొమ్మ లాంటి పావని కాలేజీ రోజుల్లో అందరికీ 'డ్రీమ్ గర్ల్' అయింది.

"అలిగినప్పుడు పావని ఎంత అందంగా ఉంటుందో ! కోపంలో పావని మొహం ఎర్ర మందారంలా మారిపోతుంది. దాని మొగుడు దానితో ఎప్పుడూ పోట్లాడి కోపం తెప్పిస్తూ... అమ్మాయిగారి అందాలను చూడాలని తహతహలాడిపోతాడే" అని ఫ్రెండ్స్ అందరూ ఆటపట్టించేవాళ్ళు.

తన అందాన్ని చూసి తనను ఆట పట్టిస్తూ కవ్విస్తూ, నవ్వించే భర్త దొరుకుతాడని కన్నెకు సహజమైన కలలు ఎన్నో ఊహించుకుంది.

తమ క్లాసులో ఒక బెంగాలీ అమ్మాయి చదివేది.



ఆ అమ్మాయికి తెలుగు రాదు. హిందీలోనే "పావనీ తుమ్ గుస్సేమే బహుత్ అచ్ఛీ లగ్‌తీహెూ" అని కాంప్లిమెంట్ పారేసింది.

ఇక మగవాళ్ళు చెప్పనవసరంలేదు. కో-ఎడ్యుకేషన్ కాబట్టి తనవైపు దొంగచూపులు చూసేవాళ్ళు. అందరిలో జాన్ ఎక్కువగా చూసేవాడు. జాన్ ! జాన్ గుర్తుకు రాగానే అంత వయసులోనూ అ దో పులకింత! జాన్ అన్య మతస్థుడయినా తనంటే ఎంతో ఆరాధన. చామనచాయ అయినా సన్నగా, పొడుగ్గా చార్మింగ్‌గా ఉండేవాడు. తనకు ఎదురుగా అబ్బాయిల వరుసలో కూర్చునేవాడు. అంటే తను వెనుక నుంచి అతనికి బాగా కనిపించేదన్న మాట. ఎప్పుడూ తనవైపు చూసేవాడు. తనకు కోపం వచ్చేది. తను కోపగించుకునే కొలదీ మరీ మరీ చూసేవాడు. అతని ఆరాధన గుర్తించినా గుర్తించినట్లే ఉండిపోయింది.

ఫైనల్ ఎగ్జామ్స్ రాసి వస్తుండగా మామిడి చెట్టుకింద అదే పనిగా నిలుచున్న జాన్ "పావనీ" అంటూ పిలిచాడు.

"ఏం జాన్?" అంది.

"పావనీ, డిగ్రీ అయిపోయింది. ఇక మనం మళ్ళీ కలుసుకోకపోవచ్చు. నువ్వంటే నాకు చాలా ఇష్టం పావనీ."

"అది తెలుస్తూనే ఉంది జాన్..."

"అంతేకాదు పావనీ. నువ్వు అలిగితే మామూలు కంటే ఎంత అందంగా ఉంటావో తెలుసా? ఎర్రబడిపోయే నీ బుగ్గలు... కోపంతో అదిరే నీ పెదవులు... ఓహ్ ! కవులు అలకలో స్త్రీకి ఏ లక్షణాలు ఆపాదిస్తారో అవన్నీ నీకు వర్తిస్తాయి. తన ఊహతో సత్యభామను వర్ణించిన నందితిమ్మన నిన్ను చూస్తే ఇంకెంత మంచి కవిత్వం రాసి ఉండేవాడో ! అల క లేకపోతే పావని లేదు. అందుకే నీ అలకను, నిన్ను ప్రేమిస్తున్నాను."

అప్రతిభురాలైపోయింది. మామూలుగా కనబడే జాన్‌లో ఈ కవితావేశం ! ఆ వయసులో అందరూ ఆడపిల్లలకూ కలిగే సహజమైన జలదరింపు. ఎద లోయలో ఏవో పులకింతలు. ఒక పురుషుడు ఇంతగా ఆరాధిస్తున్నాడంటే చలించకుండా ఏ స్త్రీ ఉండగలదు?

"చెప్పు పావనీ. నే నంటే నీకు ఇష్టం లేదా? నీకు ఇష్టమయితే ఈ లోకాన్నీ సమాజాన్నీ నేను కేర్ చెయ్యను. ఎలాగో ఒకలా మనం బ్రతకలేకపోము." వయసు వేడి అది.

## [ఆశ] యం

ఉదయపు నీడలా
ముందు పొడువుగా
మిట్ట మధ్యాహ్నం
పట్టిగా...పొట్టిగా...
మారుతుంది ఆశ!

మధ్యాహ్నపు నీడలా
ముందు పొట్టిగా
సాయంత్రం
సాగగొట్టగా
క్రమంగా పొడవుగా
మారుతుంది ఆశయం!!

తాడికొండ రమేశచంద్ర

అతను అంత ఎమోషనల్‌గా అడిగినా పావనిలో విచక్షణ మేల్కొంది. తను తల్లిదండ్రులకు ఏకైక పుత్రిక. వారి ప్రాణాలన్నీ తన మీదే. తను జాన్‌ను పెళ్ళి చేసుకుంటే వాళ్ళు భరించలేరు.

"సారీ జాన్. నీమీద నాకు అలాంటి అభిప్రాయం లేదు. మనం మంచి ఫ్రెండ్స్‌గా విడిపోదాము" అంది.

అంతే ! తరువాత తను జాన్‌ను నిజంగానే కలవలేదు. చాలా రోజుల వరకు జాన్ ఆరాధన... అతను తనను చూడటం... తన అలకను వర్ణించిన తీరు... అవన్నీ గుర్తుకు వచ్చేవి. జాన్‌ను కాదని పొరబాటు చేశానా అని అనుకునేది.

తరువాత అన్ని హంగులూ ఉన్న రాజశేఖర్‌తో వివాహం జరిగిపోయింది. అందం, డబ్బు ఉన్న శేఖర్‌ని చూసి హీరోలా ఊహించుకుంది. శేఖర్ చెడ్డవాడు కాదు కానీ అతి మంచివాడు. ప్రతి విషయానికి తను ఎంత ఎమోషనల్‌గా ఫీల్ అవుతుందో అతను అంత కామ్‌గా ఉంటాడు. ఏ ఫీలింగ్స్ వ్యక్తం చెయ్యని అతనంటే క్రమంగా పావనిలో చిరాకు చోటుచేసుకుంది. ఇలాంటి జడపదార్థాన్ని కట్టుకున్నా నేమిటి? కోపంలో, అలకలో తను ఎంతో అందంగా ఉంటుంది అని అందరిలో ప్రసిద్ధి చెందిన అలక అతడిని ఏమాత్రం కదల్చలేకపోయిందా? "ను వ్వంటే నాకు ఇష్టం... ఐ లవ్ యూ డియర్" అని ఒక్కసారి కూడా అనడు. తను కోపం వచ్చి రాత్రిపూట దూరంగా పడుకున్నా దగ్గరకు వచ్చి బ్రతిమాలడు. తనూ దూరంగానే పడుకుంటాడు. కథల్లో, కావ్యాల్లో రాసేవన్నీ కల్పనలా?

అలాగే అయిదేళ్ళు గడచిపోయాయి. పిల్లలు కూడా పుట్టలేదు. కాబట్టి లైఫ్ మరీ బోర్ కొడుతోంది. ఇద్దరినీ పరీక్షించిన డాక్టర్లు ఎవరిలోనూ లోపం లేదన్నారు. సమయం కోసం చూస్తున్నారు. నిస్పృహతో గడుపుతూన్న పావనిలో ఆ రోజు ఉదయం శేఖర్‌తో జరిగిన పోట్లాటతో మరింత అసంతృప్తి పెరిగింది. తను అలిగినా, కోప్పడినా పట్టించుకోడు. ఇదీ వరుస. ఎంత బాగా నిద్రపోతున్నాడో చూడు. ఛ... ఛ ! ఇలాంటి మొద్దుస్వరూపంతో కాపురం ఎలా చెయ్యాలి? జాన్ లాంటి మగవాళ్ళతో అయితే ఆ సంసారం ఒక ప్రబంధ కావ్యంలా సాగిపోయేదేమో ! తను అలిగితే తన అందాన్ని ఎన్ని రకాలుగా వర్ణించి తనను ప్రాధేయపడేవాడో. జాన్‌ను కాదని తను పొరబాటు చేసిందా? చాలా ఏళ్ళ తరువాత శేఖర్ ద్వారా కలిగిన అసంతృప్తి వల్ల జాన్‌ను తలచుకుంటూ ఎప్పటికో నిద్రపోయింది పావని.

** ** **

కాలింగ్ బెల్ చప్పుడుకు నవల చదువుకుంటున్న పావని 'ఈ సమయంలో ఎవరబ్బా' అనుకుంటూ వెళ్ళి తలుపు తీసింది.

"అదేమిటే పావనీ, నన్ను గుర్తు పట్టలేదా? నేను నిర్మలను."

"నిర్మలా... నిమ్మీ ! ఓహ్... ఎన్ని రోజులకు? రావే. రా." సంతోషంతో కౌగలించుకున్నంత పని చేస్తూ లోపలకు ఆహ్వానించింది.

నిర్మల, పావని, వసంత ముగ్గురూ క్లాస్‌మేట్స్ మాత్రమే కాదు. ప్రాణస్నేహితురాళ్ళు కూడా !

ఈ అయిదేళ్ళ వైవాహిక జీవితంలో ఇద్దరు పిల్లలతో నిర్మల బాగా లావెక్కిపోయింది. అందుకే పావని వెంటనే గుర్తు పట్టలేకపోయింది.


సోఫాలో సర్దుకుని కూర్చుంటూ హాలంతా కలయచూసింది నిర్మల.

టీ.వీ., వి.సి.ఆర్. అన్ని మాడరన్ ఎక్విప్‌మెంట్స్‌తో ఉన్న ఇంటిని చూస్తూ- "ఊ... మీ ఆయన బాగా సంపాదిస్తున్నాడల్లే ఉంది" అంది నిర్మల.

"మా ఆయన క్వాలిఫికేషన్ అదే కదా. ఇన్నేళ్ళకు కలిశాము. ఏవైనా కబుర్లు చెప్పు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చావు? ఏమిటి విశేషాలు?"

"నేను... మా ఆయన, ఆయన కొలీగ్స్ ఇద్దరు ఎల్.టి.సి. మీద వచ్చాము. అందరం పిల్లలను ఇళ్ళ దగ్గర వదిలేసి జంటలుగా వచ్చాము ఎంజాయ్ చెయ్యాలని. హెూటల్ సిద్ధార్థలో ఉన్నాము. పావనీ. ఈ ఆదివారం జూలాజికల్ పార్కుకు వెళుతున్నాము. నువ్వూ, మీ ఆయన కూడా రండి. తిరిగి పాత ఫ్రెండ్స్‌తో సరదాగా గడిపినట్లు ఉంటుంది" అంది నిర్మల.

"చూద్దాంలే..." అంటూ కాలేజీ విషయాలు ఎత్తింది. ఇద్దరి మధ్య ఎన్నో విషయాలు దొర్లిపోయాయి. మళ్ళీ పాత రోజులు గుర్తుకు వచ్చాయి. నిర్మలను బలవంతం చేసి భోజనానికి ఉంచేసింది.



మాటల మధ్యలో "పావనీ. నేనేమో బస్తాలా తయారయ్యాను. నువ్వు ఇంకా అలాగే కాలేజ్ గర్ల్‌లాగే ఉన్నావు. ఆదివారం తప్పక రండే. అందరం సరదాగా ఎంజాయ్ చేద్దాము." ఫోంచేస్తుండగా అంది.

"ఆదివారం కదా... ఆలోచిద్దాం."

"అన్నట్టు మరిచిపోయాను. నీకు జాన్ గుర్తున్నాడు కదూ? అతను, అతని మిసెస్ ఏదో పనిమీద హైదరాబాద్ వచ్చారట. మేము ఉన్న హోటల్‌లోనే దిగారు. ఆదివారం పార్కుకు వాళ్ళనూ పిలిచాము. వస్తున్నారు. ఒకప్పుడు జాన్ కాలేజీలో నీ ఆరాధకుడు కదవేయ్."

జాన్ ! జాన్ ప్రసక్తి రాగానే పావని గుండె వేగంగా కొట్టుకుంది. ఎప్పటి జాన్ ! తన అలకను, కోపాన్ని పిచ్చిగా ఆరాధించిన జాన్ ! తన అలకలో కవిత్వపు అందాలు వెతుక్కుని తనను కావ్యకన్యలతో పోల్చిన జాన్ వచ్చాడా? స్వచ్ఛమైన పిల్లతెమ్మెరలాంటి రోజులను గుర్తు చెయ్యడానికి... ఓ అలలా... జాన్ వచ్చాడా?

"ఆ... జాన్ గుర్తు లేకేమిటి? గుర్తు ఉన్నాడు. అయినా అప్పటి రోజులే వేరు."

"అందుకే పావనీ....రొటీన్ లైఫ్ నుంచి బయట పడాలనే ఈ ప్రోగ్రామ్ పెట్టుకున్నాము. ఆదివారం తప్పక రావాలి" అంటూ హోటల్ ఫోన్ నంబర్ ఇచ్చి మరీ మరీ రమ్మని చెప్పి వెళ్ళింది నిర్మల.

ఆదివారం వరకూ ఏదో టెన్షన్, జాన్‌ను చూడాలనే ఆరాటం. ఆదివారం పార్కుకు వెళ్ళాలని శేఖర్‌కు చెప్పింది పావని.

ఎన్ని పను లున్నా ఆదివారం మాత్రం ఏ పనులూ అతను పెట్టుకోడు. అతనికి రెస్టే ఆ రోజు. వారం అంతా కష్టపడి ఆ రోజు ఫ్రీగా ఇంట్లోనే ఉంటాడు. అలాంటిది పావని అడగ్గానే "సారీ పావనీ... ఆ రోజు ముఖ్యమైన బిజినెస్ డీలింగ్ ఉంది. ఇంట్లోనే పేపర్స్ మీద సంతకాలు చెయ్యాలి. నాకోసం నా ఓల్డ్ ఫ్రెండ్స్‌ను కలిసే ఛాన్సు పోగొట్టుకోవద్దు. నువ్వు వెళ్ళి రా ! నా పని అవగానే నేను రెస్టు తీసుకుంటూ ఇంట్లోనే ఉంటాను. ఎలాగూ సాయంత్రానికి వచ్చేస్తావు కదా" అన్నాడు.

అలా అంటున్న అతడిని నిరసనగా చూస్తూ 'నీలాంటి మొద్దుస్వరూపం ఇలా కాక ఇంకెలా చెబుతుంది? అదే జాన్ అయితే?' అనుకుంది.

** ** **

ఆదివారం త్వరగా నిద్రలేచి పులిహోర, వడలు, చిప్స్ చేసింది. సమోసాలు బజారు నుంచి తెప్పించి అవన్నీ బుట్టలో సర్దుకుంది.

తలస్నానం చేసిన జుట్టును చాలా రోజుల తరువాత స్టయిల్‌గా బ్రష్ చేసుకుంది. బీరువా అంతా కెలికి షిఫాన్ సిల్క్ చీరలు వేసవిలో చాలా వేడి అనుకుని కుంకుమ రంగు వెంకటగిరి చీర తీసింది. ఆ చీర వెయ్యి రూపాయలు. జరీ అంతా చీర కొంగుకు, బార్డరుకు ముద్దలా వచ్చింది. ఆ చీర అంటే పావనికి చాలా ఇష్టం. ఆ చీరకు మేచింగ్‌గా జడలో ఎర్ర గులాబి. ముప్పయి ఏళ్ళు దాటుతున్నా అద్దంలో తన రూపం తనకే అందంగా కనిపించింది.

"వెళతాను..." అని చెబుతున్న పావనివైపు ఆశ్చర్యంగా చూశాడు శేఖర్. రోజూకంటే అందంగా, ఉత్సాహంగా, ముఖ్యంగా ఆ కళ్ళలో మెరుపులు కాలేజీ పిల్లలా చిన్నగా కనిపిస్తోంది.

"జాగ్రత్తగా వెళ్ళిరా... పావనీ..." అన్నాడు.

జాన్‌ను చూడాలనే ఆత్రంతో ఉన్న పావని అతని కంఠంలోని ఆప్యాయతను గుర్తించలేదు.

ఆటోలో జువలాజికల్ పార్కు ముందు దిగింది. గేటు దగ్గరే ఎదురుచూస్తున్నారు నిర్మలా వాళ్ళు.

పావని ఒక్కటే ఆటోలో దిగగానే- "అదేమిటే మీ శ్రీవారు రాలేదా? ఒక్కదానివే వచ్చావేం?" అనడిగింది నిర్మల.

"రాలేదు. ఏవో పనులు ఉన్నాయట..." అని చెప్పింది.

అక్కడున్న జంటలకు పావనిని పరిచయం చేసింది నిర్మల.

జాన్ వైపు చూసింది పావని. జాన్ జుట్టు అక్కడక్కడ తెల్లబడిపోయింది. బాగా లావయ్యాడు. అయినా స్మార్ట్‌గానే ఉన్నాడు. జాన్‌తో పోలిస్తే తన భర్త చాలా అందగాడు. కానీ జాన్ భార్య మేరీ కన్న చాయ తక్కువగా ఉన్నా జాన్‌కు జంటగా సరిపోతుంది.

అందరూ లోపలికి నడిచారు. ఏవేవో కబుర్లు.

"పావనీ! నువ్వు కట్టుకున్న చీర చాలా బాగుంది. వెయ్యి రూపాయలైనా ఉంటుంది కదూ. అంత డబ్బు మేము ఒక చీరకు పెట్టలేము" అంది నిర్మల.

నిర్మల భర్త కొలీగ్ భార్య "మా పక్కింటావిడ

---

పూసు కొచ్చిన రంగులన్నీ వెలిసిపోయాయి
దుర్మార్గం విప్పుకుంటున్న దారి ముసుగులో
అంతర్ముఖం పొడుచు కొస్తుంది


ఆయుధాలన్నీ విరిగి పోయిం తర్వాతే
మనం మన ద్వేషాల గురించి చర్చించుకుంటాం

మృత్యువును నిరసించినపుడే
ఆలోచన చిగురిస్తుంది -
నా అంతరాంతరాలలో వెలుతురు పూలు

నేనూ చీకటి
నేనూ గాలి
నేనూ నక్షత్రం
అందరం చీకట్లోనే కాపు కాశాం
పచ్చికలో ఆరడుగుల నేల కొల్చుకుంది నే నొక్కడినే

నువేమో
గుర్తెరుగని మార్గం గుండా అదృశ్యమైపోయావు
రాత్రి పూసిన కన్నీరే
క్షీర సముద్రమై ఉదయిస్తుంది
మంటలు లోలోపల మండుతూనే ఉన్నాయి .....

\- ప్రసేన్



రెండు వేలల్లో కొనుక్కుందండి. అచ్చం సినిమాలో లాంటి చీరే-చాలా బాగుంది..." అంది.

తరువాత నగలు, ఎవరెవరు ఎంత కట్నం ఇచ్చారు. ఎంత సామాను ఇచ్చారు. టీ.వీ., ఫ్రిజ్ ఇచ్చారా, లేదా?

ఆ సంభాషణ వింటూంటే మతిపోతోంది పావనికి. లోకంలో ఇంకేం సమస్యలు లేనట్లు ఇదే సంభాషణా! చక్కగా కాలేజీ రోజులగురించో, మంచి పుస్తకం గురించో, దేవులపల్లి కవిత్వం గూర్చి మాట్లాడుకోవచ్చుగా?

"మా అమ్మాయి పేరుతో ఫిక్సెడ్ వేశామండీ. దాని పెళ్ళికి పనికివస్తుందని." చెబుతోంది నిర్మల.

పావనికి ఆశ్చర్యంగా ఉంది. కట్నం అంటే మండిపడే నిర్మల, కాలేజీ రోజుల్లో ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చిన నిర్మల! తను కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకుంటూందని తన పెళ్ళి కుదిరినపుడు తన ఫ్రెండ్స్ అంతా తనను దుయ్యబట్టారు.

"పావనీ! నువ్వు కట్నం ఇచ్చి చేసుకోకుండా నిన్ను ఆరాధించే జాన్‌తో లేచిపోయి ఉండినా మేము బాధపడేవాళ్ళం కాదు. కట్నానికి వ్యతిరేకంగా యువతరం ముందుకు రావాలి." ఆవేశంగా అంది నిర్మల అందరిలో. ఫ్రెండ్స్ అందరిలో తను తప్పు చేసినదానిలా, దోషిలా ఫీలయింది ఆనాడు. మరి ఈనాడు?

హఠాత్తుగా వసంత గుర్తుకు వచ్చింది. "నిమ్మీ! వసంత ఎక్కడుందే?" అనడిగింది.

"నీకూ తెలుసుగా కట్నం లేకుండా ఆదర్శం అంటూ కులాంతర వివాహం చేసుకుంది. ఇద్దరూ రాజమండ్రిలో ఏదో ప్రయివేటు స్కూల్లో జాబ్ చేస్తున్నారు. ఇద్దరికీ కలిపి వెయ్యి రూపాయలు వస్తే ఎక్కువ. దాని ఆదర్శం దానికేం మిగిల్చింది చెప్పు? అమ్మా, నాన్న చూపించిన సంబంధం చేసుకోకూడదా? వాళ్ళ పావర్టీని కప్పిపుచ్చుకోవడానికి ఒక్క పిల్లవాడితోనే ఆపరేషన్ చేయించుకున్నారు. ఒక్క బిడ్డ...బిడ్డ కాదన్నట్లు వాళ్ళది...మరీ బడాయి..." అక్కసుగా అంది నిర్మల.

ఇద్దరు ఆడపిల్లల తరువాత ఆపరేషన్ చేయించుకోబోతే కట్నం తీసుకుని పెళ్ళి చేసుకున్న ఆమె భర్త, అత్తగారు వంశోద్ధారకుడి కోసం ఆపరేషన్‌కు అనుమతించలేదు.

దిమ్మెరపోయింది పావని వాళ్ళు నమ్మిన ఆదర్శాన్ని ధైర్యంగా జీవితమంతా ఆచరిస్తున్న వసంతనా నిర్మల తప్పు పడుతోంది! కాలేజీ రోజుల్లోని ఆ స్వచ్ఛమైన మనసులు ఎందుకిలా కలుషితం అయిపోయాయి! ఎంత హిపోక్రసీ? దేనికోసం? భావి పౌరులను తయారుచేసే మనలోనే ఇంత హిపోక్రసీ ఉంటే ఇక వాళ్ళు ఎలా తయారవుతారు? ముప్పయి ఏళ్ళు నిండిన ఆడవాళ్ళంత ఇలాగే తయారవుతారా?

కాలేజీ విషయాలు చెప్పుకుంటూ సరదాగా గడపాలని భర్త రెస్ట్‌డేను కూడా లెక్కచెయ్యకుండా వచ్చింది. కానీ ఇలాంటి మాటల కోసం కాదు. తరువాత పావనిలో ఉత్సాహం చచ్చిపోయింది.

నడుస్తూన్న పావని పక్కగా వచ్చాడు జాన్. జాన్ రాగానే పావనిలో చలనం వచ్చింది. జాన్‌తోనైనా పాత జ్ఞాపకాలు తలుచుకుంటే ఎంత బాగుంటుంది!

"పావనీ! నువ్వు ఏమీ మారలేదు. అప్పటిలాగే అందంగా ఉన్నావు. ఒక విధంగా చెప్పాలంటే ఇపుడు అందంతోపాటు హుందాతనం వచ్చింది" అన్నాడు.

అతని పలుకులు చిరు జల్లుల్లా అనిపించాయి. మనసు ఏడేళ్ళ వెనక్కు వెళ్ళిపోయింది.

"జాన్...అపుడు నువ్వు...నువ్వు...నా అలకను మెచ్చుకునేవాడివి." తడబడుతూ అంది. అతని నోటి వెంట తన సౌందర్యాన్ని పొగిడించుకోవాలి అనే స్త్రీ సహజమైన కోరిక తప్ప, పావని మనసులో ఏ దురుద్దేశం లేదు.

"ఆ అది...ఆ వయసు వేడి...ఆకర్షణ పావనీ! అప్పట్లో నువ్వు నన్ను కాదనడమే మేలయింది. మనం పెళ్ళి చేసుకుని ఉంటే ఇరువైపుల పెద్ద వాళ్ళకూ దూరమయ్యేవాళ్ళం. మన ప్రేమ ఆకలి, కోర్కెలను తీర్చలేదుగా? మేరీ ఓన్లీ డాటర్ వాళ్ళ తల్లిదండ్రులకు. వాళ్ళనాన్న టీ.వీ., ఫ్రిజ్ అన్నీ ఇచ్చాడు. లైఫ్ ఆనందంగా ఉంది." తరువాత జాన్ మాటలు వినబడలేదు పావనికి.

బాపిరాజు శశికళ, కృష్ణశాస్త్రి ఊర్వశి వికృతంగా నవ్వుతున్నారు. నంది తిమ్మన సత్యభామ అందవిహీనంగా మారిపోయింది. ఏమిటిది? మనుషుల్లోని స్వచ్ఛత ఎందుకు కలుషితమైపోతోంది? అయితే కాలేజీ రోజుల్లోని ఆదర్శాలన్నీ గాలిమాటలేనా? జాన్ ప్రేమ, అతని మాటలు నిజమనుకుని తను అతనితో వెళ్ళిపోయి ఉంటే...? ఒళ్ళు జలదరించింది. ఈ సోకాల్డ్ ఆదర్శవాదులు...ఈ హిపోక్రాట్సా రేపటి తరానికి పునాదులు?

అశాంతితో హృదయం తల్లడిల్లిపోయింది.

సాయంత్రం వరకు ఎలాగో గడిపి ఇంటికి వచ్చిన పావనికి తన భర్త అందరికంటే మంచివాడుగా అనిపించాడు.

పావనిని చూడగానే "బాగా అలసిపోయి వస్తావని టీ చేసి ఉంచాను పావనీ..." అంటూ ఫ్లాస్కులో నుంచి టీ వంపి ఇచ్చాడు.

టీ తాగుతూ కాస్త స్థిమితపడింది.

"ఎలా ఉంది పావనీ...టీ?" అనడిగాడు.

పైకి ఒకరకంగా మాట్లాడుతూ మనసులో వికృతమైన ఆలోచనలు పెట్టుకునే చాలామంది మనసుల కంటే ఎంతో బాగుంది అనుకుని "బాగుందండీ" అంది.

టీ తాగుతుండగా పావని కూర్చున్న సోఫా దగ్గరగా వచ్చి- "పావనీ! నువ్వు ఇంట్లో ఉంటే నీ విలువ తెలియలేదు. నువ్వు లేని ఇల్లు ఎంత బోసిగా ఉందో తెలుసా? నా జీవితం నీతో ఇంత ముడిపడి ఉందా అని అనిపించింది."

అతను చెబుతున్న మాటలకు విభ్రాంతిగా టీ తాగడం ఆపేసి చూడసాగింది. తన భర్త రాజశేఖరేనా ఇలా మాట్లాడుతోంది? ఏ ఫీలింగూ లేదనుకున్న జడపదార్థం!

పావని ఆశ్చర్యం గమనించి "పావనీ! నాకు తెలుసు నీ ఆశ్చర్యం! కథల్లో, సినిమాల్లోలా ప్రవర్తించలేదని నన్ను ఒక జడపదార్థంగా అనుకున్నావుకదూ? జీవితం ఊహలు కాదు. ప్రాక్టికల్‌గా ఆలోచించాలనే తత్వం నాది. ఏ ఫీలింగ్ అయినా మనసులో దాచుకుంటేనే అందం అనుకునే వాడిని నేను. మగవాడు నలభై ఏళ్ళ వరకు శ్రమపడి డబ్బు సంపాదించాలి. నలభై తరువాత ఏ వ్యక్తికయినా శరీర దారుఢ్యం తగ్గిపోయి రోగాలు మొదలవుతాయికదా! అంతలోపే డబ్బు సంపాదించి నా భార్యా పిల్లలను సుఖపెట్టాలనే తాపత్రయం నాది. కథల్లో, సినిమాల్లోలా ఉండే ఆదర్శ దంపతులు ఎంతమంది ఉంటారు పావనీ. నా 'డబ్బు సంపాదనలో నిన్ను నీ కోరికలనూ నిర్లక్ష్యం చేసినా, డబ్బు విలువ నాకు బాగా తెలుసు పావనీ. నలభై ఏళ్ళ తరువాత నీ దగ్గరే ఉంటూ హాయిగా విశ్రాంతి తీసుకుంటాను. అందుకే నా ఈ శ్రమ. అంతేకాదు-నా భార్యగా, ఈ ఇంటి వెలుగుగా నువ్వు అందంగా ఉన్నా లేకపోయినా నిన్ను ప్రేమిస్తాను పావనీ, అది నా బాధ్యత. నీ బాధ, కోపం, సంతోషం అన్ని ఫీలింగ్స్‌ను భరించే వాడిని నేనేకదా. నువ్వు నన్ను జడపదార్థం అనుకున్నాసరే" అన్నాడు.

అలకలో తన అందాన్ని కావ్యనాయికలతో పోల్చిన జాన్ కంటే...నిర్మల లాంటి హిపోక్రట్స్ కంటే..తను మొద్దావతారం అని భావించే తన భర్త ఎంత గొప్పవాడు! ఎందుకో విపరీతంగా నవ్వు వచ్చింది. తెరలు, తెరలుగా నవ్వసాగింది.

"ఎందుకలా నవ్వుతున్నావు పావనీ? అంత సిల్లీగా మాట్లాడానా? లేక నామీద అలక కాదుకదా!" భయం నటిస్తూ అడిగాడు.

"కాదండీ. ఇక మీదట నేను అలగనే అలగను. అలక అంటే నాకు అసహ్యం." అంది నవ్వుతూనే! *

